స్వావలంబన దిశగా ఆమె



ఈ ఫొటోలో ఉన్న మహిళ పేరు పి.అరుణ. మండలంలోని మరుపూరు గ్రామానికి చెందిన బాలగణేష్ పొదుపు మహిళా గ్రూపులో సభ్యురాలు. ఈమె పొదలకూరు కెనరాబ్యాంకు నుంచి పిండిమిల్లు ఏర్పాటుకు రూ.1.50 లక్షలను రుణంగా తీసుకుని యూనిట్‌ను ఏర్పాటు చేశారు. రోజువారి పనులు చూసుకుంటూనే పిండిమిల్లు ద్వారా ప్రతినిత్యం రూ.300 వరకు సంపాదిస్తున్నారు.



ఈ ఫొటోలో ఉన్న మహిళ పేరు సంద్ర హరిప్రియ. మండలంలోని తాటిపర్తి పంచాయతీ బత్తులపల్లిపాడు గ్రామానికి చెందిన శ్రీనివాస పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉన్నారు. మహ్మదాపురం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ద్వారా రూ. లక్ష రుణం పొంది పాప్‌కార్న్, పీచుమిఠాయి, చెరకు రసం యూనిట్‌లను ఏర్పాటు చేశారు. రోజువారి తన పనులు చూసుకుంటూ రూ.500 వరకు సంపాదిస్తున్నారు.



మహిళలు ఏర్పాటు చేసిన యూనిట్లను పరిశీలిస్తున్న మంత్రి కాకాణి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి(ఫైల్)

- బ్యాంకు రుణాలతో వివిధ యూనిట్ల ఏర్పాటు
- మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతున్న రాష్ట్ర ప్రయత్నం
- చిన్న, మధ్య తరహా యూనిట్లకు దరఖాస్తులు

మండలంలో..	
పొదుపు గ్రూపులు	1,542
పొదుపు సభ్యులు	15,897

పొదలకూరు : గ్రామీణ ప్రాంతాల మహిళలు ఆర్థిక స్వావలంబన పొందేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందుకోసం బ్యాంకు రుణాలను మంజూరు చేయించి చిన్న, పెద్ద రకాల యూనిట్లను ఏర్పాటు చేయిస్తోంది. గ్రామీణ ప్రాంత పొదుపు మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తోంది. మహిళలు ఏర్పాటు చేసే యూనిట్లకు సబ్సిడీని కూడా అందజేస్తూ ఆర్థికంగా ఎదిగేందుకు సహాయ, సహకారాలు అందజేస్తోంది. మండలంలో మొత్తం 1,542 పొదుపు సంఘాలు ఉండగా ఇందులో 15,897 మంది పొదుపు మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరికి ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు అందజేస్తూనే వివిధ రకాల యూనిట్ల ఏర్పాటు కోసం ప్రత్యేకంగా బ్యాంకు రుణాలను అందజేస్తోంది.

హైర్ ఆర్డర్ ఎంటర్‌ప్రైజస్ యూనిట్లు

మండలంలో హైర్ ఆర్డర్ ఎంటర్‌ప్రైజస్ ద్వారా మొత్తం ఐదు యూనిట్లను ఏర్పాటు చేస్తారు. బ్యాంకు రుణాల ద్వారా పొదుపు మహిళలకు రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు రుణాలను అందజేస్తారు. ఈ రుణాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ సహకారంతో 35 శాతం రాయితీని కల్పిస్తారు. ఫలితంగా మహిళలు యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు వైఎస్సార్ క్రాంతిపథం అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందిస్తారు. మండలంలో మరుపూరు, అయ్యగారిపాళెం, బత్తులపల్లిపాడు, పులికల్లు, అయ్యగారిపాళెం గ్రామాల్లో ఇప్పటివరకు పిండిమిల్లులు, పాప్‌కార్న్, అప్పడాల తయారీ తదితర యూనిట్లను గ్రౌండింగ్ చేయించారు. మహిళలే యూనిట్లను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు.

ఉమన్ లెడ్ ఎంటర్‌ప్రైజెస్ యూనిట్లు

పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఉమన్ లెడ్ ఎంటర్‌ప్రైజస్ ద్వారా బ్యాంకు లింకేజీతో మహిళలకు రుణాలు అందజేసేందుకు కృషి చేస్తున్నారు. మండలంలో ఈ యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు సుమారు 120 దరఖాస్తులు బ్యాంకులకు సీసీలు అందజేశారు. ఈ రుణాలు మంజూరైతే రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు విలువైన యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. అయితే మహిళలు ఈ రుణాలను రాయితీ లేకుండా బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుంది. వీరి తరఫున బ్యాంకులకు ప్రభుత్వమే హామీ ఉండి రుణాలను పంపిణీ అందజేసేందుకు కృషి చేస్తుంది. రుణాలు పొందే మహిళలు టైలరింగ్, క్లాత్‌మర్చంట్స్, కిరాణా మర్చంట్స్, కూల్‌డ్రింక్ షాపు, గేదెల పెంపకం, ఐస్‌క్రీమ్ పార్లర్ వంటి దుకాణాలను ఏర్పాటు చేసుకోవచ్చు. మహిళలను పారిశ్రామిక వేత్తలుగా రూపొందించేందుకు జిల్లా, మండల స్థాయిలో డీఆర్‌డీఏ అధికారులు సదస్సులను కూడా నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలని..



గ్రామీణ మహిళలు ఆర్థికంగా ఎదిగి స్వావలంబన పొందాలని ప్రభుత్వం వివిధ రకాల యూనిట్లను ఏర్పాటు చేయిస్తోంది. ఇందుకోసం బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు అందజేస్తున్నాం. రుణాలు పొందిన మహిళలు యూనిట్లను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. త్వరలో ఉమన్ లెడ్ ద్వారా కూడా రుణాలను అందజేస్తాం. రుణాలు కావాల్సిన మహిళల ద్వారా బ్యాంకులకు దరఖాస్తులను అందజేస్తాం.

– రోజ్‌మేరీ, ఏపీఎం, వైఎస్సార్ క్రాంతి పథం, పొదలకూరు



వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం

కామాక్షితాయికి విశేష పూజలు



స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు చేస్తున్న అర్చకులు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో కోటి కుంకుమార్చన మహాయజ్ఞంలో భాగంగా ఆదివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం తీర్థ సంగ్రహణం, లక్ష్మీగణపతి పూజ, కలశ స్థాపన, రుత్విగ్వరణం, దీక్షధారణ, గోపూజ, నందీశ్వరపూజ, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పూజ నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై దాదాపు 100 మంది రుత్వికుల చేత కోటి కుంకుమార్చన మహాయజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రికి గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జున స్వామికి కల్యాణం, కౌమారీ పూజ, సుహాసిని పూజ జరిపించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా కె.బాలాజీ, కామాక్షి దంపతులు, ఎం.నరసింహారావు, వెంకటప్రమీల దంపతులు, సోమశేఖర్‌రెడ్డి, జయంతి దంపతులు, హరికిశోర్‌రెడ్డి, ప్రమీలమ్మ దంపతులు వ్యవహరించగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, పాలక మండలి సభ్యులు నందకుమార్, రఘురామయ్య, శివకుమార్, పద్మమ్మ, సుప్రజ, కామేశ్వరి, విమలమ్మ, శశిశేఖర్‌శర్మ పాల్గొన్నారు.



కోటి కుంకుమార్చనలో ఆలయ చైర్మన్ దంపతులు

గాలివాన బీభత్సం



తాటిచెట్టు పడడంతో తెగిన విద్యుత్ తీగలు



విద్యుత్ తీగల మీదుగా నేలకొరిగిన తాటిచెట్టు

- నేలకొరిగిన ఆరు విద్యుత్ స్తంభాలు
- యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు

కొడవలూరు: మండలంలో శనివారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో గాలివాన బీభత్సం సృష్టించింది. సుమారు అరగంట పాటు ఈదురు గాలులతో కూడిన వర్షం పడడంతో మండలంలోని రెడ్డిపాళెంలో తాటిచెట్టు విద్యుత్ తీగలపై పడడంతో ఆరు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈ స్తంభాలన్నీ వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు సంబంధించినవి కావడంతో రెడ్డిపాళెం, ఆలూరుపాడుల్లోని వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రైతుల ఫిర్యాదుతో స్పందించిన విద్యుత్‌శాఖ ఏఈ ఎం.రాములు ఆదివారం ఉదయం సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టి మధ్యాహ్నానికి సరఫరాను పునరుద్ధరించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సకాలంలో స్పందించి వ్యవసాయ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం: మోటార్ సైకిల్ అదుపు తప్పడంతో ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఈ ఘటన తిక్కవరప్పాడు–వెంకటాచలం గ్రామా ల మధ్యన శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు..నిడిగుంటపాళేనికి చెందిన మణి మరో యువకుడితో కలిసి వెంకటాచలం నుంచి సర్వేపల్లి వైపు వెళుతుండగా తిక్కవరప్పాడు సమీపంలో మోటార్‌సైకిల్ అదుపుతప్పడంతో ఇద్దరూ గాయపడ్డాడు. క్షతగాత్రులను స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



కొడవలూరు : మండలంలోని చంద్రశేఖరపురం ఏకలవ్య గిరిజన బాలికల గురుకుల కళాశాలలో 2015లో ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థినులు ఆ కళాశాలలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎనిమిదేళ్ల తరువాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకున్నారు. స్నేహితులు, అధ్యాపకులతో గత స్మృతులను పంచుకొని ఆనందించారు. అనంతరం అధ్యాపకులను సన్మానించి వారితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. చివరిగా సామూహిక విందు భోజనం చేసి కార్యక్రమాన్ని ముగించారు. ఈ సందర్భంగా అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘ చైర్మన్ వై.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అలనాటి స్నేహితులతో కలిసి పాత జ్ఞాపకాలను పంచుకోవడం మధురానుభూతినిస్తోందని చెప్పారు. ఇలాంటి సమ్మేళన కార్యక్రమాల వల్ల స్నేహ బంధం మరింత బలపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్స్ జలేంద్రుడు, కె.మహేశ్వరయ్య, రిటైర్డ్ ఓఎస్డీ దయాకర్, గురుకులాల ప్రిన్సిపాల్స్ టి.విష్ణుప్రియ, శోభాన్విత, సుజాత, యానాదుల సంక్షేమ సంఘ నేతలు వేణుబాబు, ప్రసాద్‌బాబు, సుధాకర్, కార్యక్రమ ఆర్గనైజర్లు పూజిత, శ్యామల, శారద పాల్గొన్నారు.

నేడు మోటార్ బైక్ బహిరంగ వేలం

కొడవలూరు : కోవూరు ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలోని టీవీఎస్ రైడర్ మోటార్ సైకిల్‌కు సోమవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఈబీ సీఐ ఆర్.నరహరిరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బైక్ ధరను రూ.25 వేలుగా నిర్ణయించినట్లు తెలియజేశారు. వేలంలో పాల్గొనే వారు రూ.2,500లు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి కలిగిన వారు ఉదయం 10.30 గంటలకు కోవూరు ఎస్‌ఈబీ స్టేషన్ వద్ద జరిగే వేలంలో పాల్గొనాలని కోరారు.

యువకుడిపై కత్తితో దాడి



చికిత్స పొందుతున్న వినయ్

కోవూరు(విడవలూరు): ఓ అమ్మాయి విషయమై నెలకొన్న వివాదం నేపథ్యంలో ఓ యువకుడిపై మరో యువకుడు కత్తితో దాడికి పాల్పడిన ఘటన విడవలూరు మండలం వావిళ్లలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. వావిళ్లకు చెందిన పంచమూర్తి వినయ్ ఏసీ మెకానిక్ పనినేర్చుకునేందుకు ప్రతి రోజూ ఆర్టీసీ బస్సులో నెల్లూరు వెళ్లేవాడు. అదే బస్సులో వావిళ్లకు చెందిన విష్ణు, నార్తురాజుపాళేనికి చెందిన మరో విద్యార్థిని నెల్లూరు వెళ్లే వారు. బస్సులో వినయ్ రాజుపాళెం విద్యార్థినితో చనువుగా ఉండేవాడు. ఈ విషయాన్ని పసిగట్టిన విష్ణు ఆ అమ్మాయితో మాట్లాడితే ఒప్పుకునేది లేదంటూ పలుమార్లు వినయ్‌ను బెదిరించాడు. అంతేకాకుండా వారం రోజుల వ్యవధిలోనే తన స్నేహితులైన పండు, కిషోర్‌తో కలిసి వినయ్‌ను కొట్టాడు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న వినయ్ ఆదివారం విష్ణుకు ఫోన్ చేసి వావిళ్ల స్కూల్లో ఉన్నాను రమ్మని పిలిచాడు. దీంతో విష్ణు తన స్నేహితులైన పండు, హర్షతో కలిసి అక్కడకు వెళ్లాడు. అక్కడ ఇరువురు నడుమ మాటమాట పెరగడంతో విష్ణు తన దగ్గర ఉన్న సూరి కత్తితో వినయ్ గొంతుపైన దాడి చేశాడు. వినయ్‌ను స్నేహితుడు పక్కకు లాగడంతో ప్రాణాపాయం తప్పింది. స్థానికుల సహకారంతో 108లో వినయ్‌ను కోవూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విష్ణుపైన హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు.

బలిజపాళెం పాఠశాలకు మహర్దశ



గతంలో బలిజపాళెం పాఠశాల దుస్థితి



నేడు ప్రారంభానికి సిద్ధమైన పాఠశాల భవనం

- రూ.2 కోట్లతో పునర్నిర్మాణం
- నాడు శిథిలం, నేడు సుందరం

ముత్తుకూరు : ముత్తుకూరు పంచాయతీలోని బలిజపాళెం పాఠశాలకు మహర్దశ పట్టింది. వెంకటాచలం రోడ్డు చెంతనే ఉన్న ఈ పాఠశాలకు గతంలో ప్రహరీ కూడా ఉండేది కాదు. పాఠశాలలోని రెండు భవనాలు సైతం శిథిలావస్థకు చేరాయి. పిల్లలను బడికి పంపేందుకు తల్లిదండ్రులు భయపడే పరిస్థితి కొనసాగింది. ఈ దశలో పంటపాళెం సమీపంలో భారీ పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని 'బొంగె' అనే సంస్థ తలపెట్టింది. ఈ ఫ్యాక్టరీ నిర్వాహకులు పాఠశాల పరిస్థితిని గమనించారు. పాత భవనాల స్థానంలో రూ.2 కోట్ల వ్యయంతో కొత్త భవనాలను సంస్థ వారు నిర్మించారు. ఈ నిధులతో ఫర్నీచర్ సౌకర్యం కల్పిస్తున్నారు. ప్రహరీతో పాటు సర్వాంగ సుందరంగా నిర్మాణం పూర్తయిన ఈ భవనాలను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

మొహర్రం పండగకు దర్గా ముస్తాబు

మనుబోలు : మండలంలోని కాగితాలపూరు గ్రామం మొహర్రం పండగకు ముస్తాబైంది. దీంతో గ్రామంలోని రెండు దర్గాలను నలుపు రంగు కాగితాలతో అలంకరించారు. ఈనెల 29వ తేదీన మొహర్రం పండగ నేపథ్యంలో పది రోజుల ముందే వేడుకలు ప్రారంభమవుతాయి. దీంతో హజ్రత్ ఇమాం, హజ్రత్ అబ్బాస్ పీర్లను ఆదివారం ముస్తాబు చేసి దర్గాల్లో ఉంచారు. మహిళలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈనెల 26న పీర్ల గ్రామోత్సవం నిర్వహిస్తారు. 27న చిన్న అగ్నిగుండం, 28న పెద్ద అగ్నిగుండం వేస్తారు. 29న మాతం(రెండు వేళ్ల మధ్య బ్లేడు ఉంచుకుని చాతిపై కొట్టుకోవడం) చేస్తూ రక్తం చిందిస్తారు. కాగితాలపూరు గ్రామంలో చాలా కాలంగా మొహర్రంను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ వేడకలను చూసేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా హైదారాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, దుబాయి, కువైట్ తదితర ప్రాంతాల్లో స్థిరపడిన ముస్లింలు హాజరవుతారు.

మొహర్రం చరిత్ర

1337 సంవత్సరాల క్రితం సిరియాను ముస్లింల సంప్రదాయాలకు వ్యతిరేకంగా పరిపాలిస్తున్న ఎజీద్‌ను మహమ్మద్ ప్రవక్త రెండో మనుమడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ ఎదిరించాడు. దీంతో హజ్రత్ ఇమామ్‌ను చర్చలకు పిలిచిన ఎజీద్ ఇరాక్‌లోని కర్బలా మైదానంలో హజ్రత్, ఆయన కుటుంబ సభ్యులు 72 మందిని దారుణంగా చంపివేశాడని, నాటి దుర్ఘటనకు నిరసనగా ఏటా మొహర్రం జరుపుకుంటారని ముస్లిం మత పెద్దలు తెలిపారు.



ముస్తాబైన దర్గా



దర్గాలో అలంకరించిన హజ్రత్ ఇమాం, హజ్రత్ అబ్బాస్ పీర్లు

సత్ఫలితాలిస్తున్న 'జగనన్న సురక్ష'



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు పరమాల తిరుమల. కోవూరు మండలం పడుగుపాడు ఎన్టీఆర్ నగర్ గిరిజన కాలనీలో నివాసం ఉంటున్నారు. ఈమె కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. తన పిల్లలను పాఠశాలలో చేర్పించాలంటే కుల ధ్రువీకరణ పత్రం అవసరమైంది. అందుకు జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటి వద్దే సర్టిఫికెట్లు అందజేశారు. దీంతో ఆమె ఆనందానికి అవధులు లేవు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు దాసరి కావేరి. కోవూరు మండలం పడుగుపాడు ఎన్టీఆర్ కాలనీలో నివాసం ఉంటోంది. ఈమెకు కుల ధ్రువీకరణ పత్రం అవసరం. ఇందుకోసం కూలి పనులు మానుకుని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగింది. అయితే జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి వివరాలు నమోదు చేసుకున్నారు. సురక్ష శిబిరంలో సర్టిఫికెట్‌ను అందించారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు సోకా ఓబులమ్మ. కోవూరు మండలం పడుగుపాడు ఎన్టీఆర్ నగర్ గిరిజనకాలనీలో ఉంటారు. నవరత్నాల్లో భాగంగా అమ్మఒడి, రైతుభరోసా, వైఎస్సార్ ఆసరా తదితర పథకాలకు అర్హత పొందాలంటే అందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఎంతో ముఖ్యం. కాగా జగనన్న సురక్ష కార్యక్రమంలో ఒకేసారి రూపాయి ఖర్చు లేకుండా కులం, ఆదాయం, జనన ధ్రువీకరణ పత్రాలు పొందారు. గతంలో వీటి కోసం కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. జగనన్న సురక్ష కార్యక్రమం వల్ల పైసా ఖర్చు లేకుండా అన్నీ వచ్చాయి.



ధ్రువీకరణ పత్రాలు పొందిన వారితో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి(ఫైల్)

- సంక్షేమానికి దూరమైన అర్హులకు మేలు
- దరఖాస్తుదారుల హర్షం

కోవూరు : అన్ని అర్హతలు ఉండి ధ్రువీకరణ పత్రాలు లేక, సాంకేతిక కారణాల వల్ల పథకాలకు దూరమైన వారికి జగనన్న సురక్ష ఎంతో మేలు చేకూరుస్తోంది. దీని ద్వారా ప్రభుత్వం ఇంటి వద్దనే సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తోంది. ఇలా జనన, మరణ, కుల, ఆదాయ వంటి 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేస్తున్నారు. గతంలో ఏదైనా ధ్రువీకరణ పత్రం పొందాలంటే మండల కేంద్రానికి పరుగులు తీయాల్సిందే. వ్యయప్రయాసల కోర్చి అంత దూరం వెళ్లి అర్జీ ఇచ్చినా ధ్రువీకరణ పత్రం ఎప్పుడు చేతికి వస్తుందో చెప్పలేని పరిస్థితి. అంతే కాక మధ్యవర్తులు, కొందరు అధికారుల చేయి తడపనిదే పత్రం చేతికి రాని పరిస్థితి. వీటన్నింటికీ స్వస్తి పలుకుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. వాటి పరిధిలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి ప్రజలకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాలను గుర్తిస్తారు. ఈ మేరకు దరఖాస్తులు కూడా స్వీకరిస్తారు. తరువాత సురక్ష శిబిరంలో సర్టిఫికెట్లు అందజేస్తారు. ఇలా ఇప్పటి వరకు అనేక మంది వందల సంఖ్యలో ధ్రువీకరణ పత్రాలను పొందారు. వీటి వల్ల వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయి. కాగా ఈ కార్యక్రమం ఈనెల చివరి వరకు కొనసాగుతుంది.

కోవూరు మండల పరిధిలో..	
దరఖాస్తులు	13,708
సర్టిఫికెట్లు అందజేసినవి	13,688